TELANGANA POLITRICKS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
పొలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
సోమవారం, 06.11.2023
హైదరాబాద్
1pm edition

పొలిట్రిక్స్

కలిసిపోతరా వేరుకుంపటి పెడ్తరా?

- ప్రత్యర్థుల చేరికలతో గులాబీ పార్టీలో గందరగోళం
- 'ఆపరేషన్ ఆకర్స్' తో కారు పార్టీలో కొత్త సమస్య
- కొత్త వారికి ప్రచార బాధ్యతలు ఇవ్వాలా? వద్దా..?
- వారి సహకారంపై అభ్యర్థుల అనుమానం..
- లెక్కలేసుకునే పనిలో క్యాండిడేట్ల బిజీ..బిజీ..

విశాల భారతి, హైదరాబాద్:

తెలంగాణలో హ్యాట్రిక్‌విన్‌కొట్టడమే లక్ష్యంగా అధికార బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో దూసుకుపోతోంది. పార్టీ బలం పెంచుకునేందుకు అన్ని పార్టీల నేతల చేరికకు డోర్లు బార్లా తెరిచింది. అయితే ప్రస్తుతం గులాబీ పార్టీలో చేరికలపై గందరగోళం నెలకొంది. లోకల్ లీడర్లు, ఎమ్మెల్యే అభ్యర్థులకు తెలియకుండానే తెలంగాణ భవన్‌లో చేరికలు జరిగిపోతున్నాయి. అయా నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు కూడా అభ్యర్థులతో సంబంధం లేకుండానే గులాబీ కండువా కప్పుకుంటున్నారు. దీంతో కొత్తగా చేరిన వారికి ఎన్నికల బాధ్యతలు అప్పగించాలా..? వద్దా..? వారు పార్టీలోకి వస్తే ప్లస్ అవుతారా..? మైనస్ అవుతారా అని లెక్కలేసుకోవడం అభ్యర్థుల వంతు అవుతోంది. అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీఆర్ఎస్.. ఎన్నికల వేళ ఆపరేషన్ ఆకర్ష్‌తో దూసుకుపోతోంది. బీజేపీ, కాంగ్రెస్ నుంచి భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు రోజూ అధికార పార్టీలోకి వచ్చి గులాబీ కండువా కప్పుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థుల ప్రకటన తర్వాత మరింత జోరు అందుకుంది. మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులు కొంతమంది నేతల ఇంటికి వెళ్లి మరీ, గులాబీ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. మరి కొంత మందిని డైరెక్ట్ బీఆర్ఎస్‌భవన్‌నుంచి ఆపరేషన్ చేసి పార్టీలోకి చేర్చుకుంటున్నారు. అయితే, వారి నియోజకవర్గాల్లో చేరుతున్న నేతల సమాచారం అయా నియోజకవర్గ అభ్యర్థులకు ఉండకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కొన్ని సందర్భాల్లో మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులు పార్టీలో చేరాలనుకునే నేతల ఇంటికి వెళ్తున్న సమాచారం కూడా పార్టీ అభ్యర్థులకు ఉండడం లేదని తెలుస్తోంది. చాలా చేరికల్లో అభ్యర్థులు లేకుండానే జరిగిపోతున్నాయని అంటున్నారు. తాజాగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో రామ్మోహన్ గౌడ్‌ను మంత్రి హరీశ్‌రావు పార్టీలో చేర్చుకునే సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ రెడ్డి లేకుండా జరిగిపోయిందని తెలిసింది. అటు మానకొండూరు నియోజకవర్గం నుంచి బీజేపీ నేత గడ్డం మధు చేరే సందర్భంలో స్థానిక అభ్యర్థి రసమయి కిషన్ లేకుండానే కార్యక్రమం పూర్తయింది ఇలా చాలా చేరికలు అభ్యర్థులకు తెలియకుండా, వారు లేకుండానే జరిగిపోయాయట. కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంగళరావు చేరిక విషయం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు చివరి నిమిషంలో సమాచారం ఇచ్చినట్ట పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

కొన్ని నియోజకవర్గాల్లో తమ ప్రత్యర్థి పార్టీ ముఖ్య నేతలు పార్టీలోకి వస్తుండడం, అభ్యర్థులకు గందరగోళంగా మారింది. వారు తమకు అనుకూలంగా పనిచేస్తారా ? తమకు నష్టం చేస్తారా ? అన్న చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో తమ వ్యతిరేకంగా పనిచేసిన నేతలు కూడా పార్టీ ముఖ్యనేతల సమక్షంలో బీఆర్ఎస్ లో చేరుతున్నారు. నిన్నటి వరకు ప్రత్యర్థులుగా పనిచేసిన నాయకులు కూడా గులాబీ కండువా కప్పుకుంటున్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వారికి బాధ్యతలు అప్పగించాలా? వద్దా? అన్న సందేహంలో అభ్యర్థులు ఉన్నారని తెలుస్తోంది. ఒక వైపు ఎన్నికల్లో అందరిని కలుపుకుపోవాలని పార్టీ బీఆర్ఎస్‌బాస్ అభ్యర్థులకు సూచిస్తున్నారు. అయితే కొత్తగా చేరుకున్న వారికి బాధ్యతలు ఇవ్వాలా వద్దా.. ఇప్పుడు తమకు ప్లస్ అవుతుందా? మైనస్ అవుతుందా ? అని అంచనా వేసుకుంటున్నారు అభ్యర్థులు.



గంటన్నర ముందు మాక్ పోలింగ్

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు

విశాల భారతి, హైదరాబాద్:

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఆ ఓట్లను తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. మాక్ పోలింగ్‌తో సాధారణ పోలింగు నిర్వహణ జాప్యం అవుతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో గంటన్నర ముందుగా నిర్వహించాలని సూచించింది. మాక్ పోలింగ్ ప్రక్రియలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం 50 ఓట్లు వేయాలి. ఏ అభ్యర్థికి ఎన్నెన్ని ఓట్లు వేశారన్నది నమోదు చేయాలి. అప్పటి కప్పుడే ఓట్ల లెక్కింపు, వీవీప్యాట్‌లోని స్లిప్పుల లెక్కింపూ జరిగిపోవాలి. అన్నీ సరిపోయాయా? లేదా? అని నిర్ధరించుకోవాలి. ఒకవేళ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన పక్షంలో ఆ యంత్రాన్ని తొలగించి మరో యంత్రంతో మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపింది. మాక్ పోలింగ్‌లో వేసిన ఓట్లను విధిగా తొలగించాలని, పోలింగ్ ఏజెంట్లకు వాటిని చూపించాలని పేర్కొంది. ఒకవేళ తొలగించడం విస్మరించి, ఆ తరవాత గుర్తించిన పక్షంలో ఆయా వివరాల నివేదికను అధికారులకు పంపడంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌కు పంపే యంత్రాల లాగ్‌బుక్‌లోనూ నమోదు చేయాలని, ఓట్ల లెక్కింపు సమయంలో వాటిని విస్మరించాలని మార్గదర్శకాల్లో కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

మరో రూ.10 కోట్ల సొత్తు స్వాధీనం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ స్వాధీనం చేసుకున్న సొత్తు రూ.490 కోట్లకు చేరుకుంది. 24 గంటల వ్యవధిలో కొత్తగా రూ.10.35 కోట్ల సొత్తు పట్టుబడింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం ఉదయం 9 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకూ రాష్ట్రంలో రూ.2,53,10,520 నగదు, రూ.4,32,66,403 కోట్ల విలువైన మద్యం, రూ.78,84,250 విలువైన మత్తుపదార్థాలు, రూ.75,10,776 విలువైన బంగారం, రూ.1,95,13,700 విలువైన చీరలు, కుక్కర్లు వంటి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల వ్యవధిలో రూ.10,35,00,329 సొత్తు స్వాధీనం అయింది. దీంతో ఇప్పటి వరకూ పట్టుబడ్డ సొత్తు విలువ రూ.490,60,33,789కి చేరింది.

కాళేశ్వరం, కల్యాణ లక్ష్మే కాదు..

మేడ్చల్‌కు నువ్వేం చేసినవ్?

ఎన్నికల ప్రచారంలో మల్లారెడ్డికి నిరసనల సెగ..

- అడుగడుగునా అడ్డుకుంటున్న నియోజకవర్గ ప్రజలు
- సమాధానం చెప్పలేక నీళ్లు నములుతున్న 'చామకూర'
- 'నాకు ఓటు వెయ్యకండి' అని విసుక్కుంటూ జంప్
- మల్లన్న తీరుపై స్థానికంగా ఉండే నేతల అసహనం..
- జనం దెబ్బకు ప్రచారంలో కనిపించని పాత జోరు..

నువ్వేం చేసినవ్?

మల్లారెడ్డి మాట్లాడితే కాళేశ్వరం, కల్యాణ లక్ష్మీ, ఆసరా పింఛన్లు అంటూ రాష్ట్ర ప్రభుత్వం పథకాలను వల్లించడం తప్పా.. మేడ్చల్ ఎమ్మెల్యేగా, కార్మిక శాఖ మంత్రిగా ఈ ప్రాంతానికి ఏం చేసిండో చెప్పేందుకు ముందుకు రావడం లేదు. ప్రజలు సంధించే ప్రశ్నలకు గతంతో పోలిస్తే మల్లారెడ్డి ప్రచారంలో జోష్ పూర్తిగా తగ్గిపోయిందనే చర్చ నడుస్తోంది. ఆదివారం నియోజకవర్గంలో ఎంతో గ్రాండ్‌గా బైక్‌ర్యాలీ బైక్ ర్యాలీ జనం నిరసనల దెబ్బకు మమ అనిపించాల్సి వచ్చిందని క్యాడర్ ఊసురుమంటున్నారు. మల్లారెడ్డి పై ఉన్న వ్యతిరేకతకు తోడు బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో ప్రచారంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా నిరసన సెగలు తగులుతున్నాయి. నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో విఫలం కావడంతో అడుగడుగునా ప్రజలు అడ్డుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు కాదు.. ' మీరు చొరవ తీసుకుని నియోజకవర్గానికి చేసిన ఒక్క మంచిపని చెప్పండి' అంటూ నిలదీస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక మల్లన్న నీళ్లు నములుతున్నారు. పైగా ప్రజలకు శాంతియుతంగా సమాధానం చెప్పాల్సింది పోయి.. 'మీ కాలనీకి రాను.. నాకు మీరు ఓటేయ్యకండి' అంటూ ప్రశ్నించిన ఓటర్లపై విసుక్కుంటున్నారు. ప్రచారంలో ఆయన తీరు చూస్తుంటే 'ఏమైంది మల్లారెడ్డికి'? అని సొంత పార్టీ నేతలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే ఓటమి తప్పదంటూ చర్చించుకుంటున్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బోడుప్పల్, పీర్జాదీగూడ కార్పొరేషన్ల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నేతలు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న మల్లారెడ్డిని వివిధ కాలనీల ప్రజలు అడ్డుకున్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చింతల చెరువు నుంచి వెలువడే కలుషిత జలాలను ఎలాంటి ప్రత్యామ్నాయం లేకుండానే మా కాలనీలకు వదలడంతో తీవ్రమైన దుర్వాస వస్తుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అయోధ్య నగర్, ప్రగతి నగర్, చెంగిచెర్ల హిమగిరి కాలనీలకు చెందిన వందలాది మంది కాలనీ వాసులు మల్లారెడ్డి అడ్డుకుని సమస్యలపై నిలదీశారు. దీంతో మల్లారెడ్డి కాలనీ వాసులతో మాట్లాడుతూ చింతల చెరువు చెరువు నుంచి మురుగు నీటిని వదిలిన విషయం తనకు తెలియదని, మీటింగ్ అయ్యాక వస్తానని ఒకవేళ రాకుంటే మీ కాలనీల ప్రజలు నాకు ఓటెయ్యొద్దని కరాఖండిగా చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై కాలనీ వాసులు మాట్లాడుతూ మల్లారెడ్డి సినిమా డైలాగులు కొట్టడానికి మాత్రమే సరిపోతాడని, ఆయనకు ప్రజా సమస్యల పరిష్కారం ఏమాత్రం పట్టిలేదని వాపోయారు. మళ్లీ మా కాలనీలకు ఓట్లడిగేందుకు వస్తాడు.. కదా.. అప్పుడు, ఆయనది, స్థానిక బీఆర్ఎస్‌నేతల సంగతి తేలుస్తామని హెచ్చరించారు.

మరోసారి అవకాశం ఇవ్వండి: - మల్లారెడ్డి

మేడ్చల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని మరింతగా అభివృద్ధి చేయాలంటే.. మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. జంట కార్పొరేషన్ల పరిధిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ సర్కారు కే దక్కిందని, మరోసారి కేసీఆర్ సర్కారు అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, పీర్జాది గూడ అధ్యక్షుడు దర్గా దయాకర్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పీర్జాదీగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు కుర్ర శివకుమార్ గౌడ్, కొత్త లక్ష్మీ రవి గౌడ్, కార్పొరేషన్ల కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

పెయిడ్‌బ్యాచ్‌తో స్థానిక నేతల తిప్పలు..

ఆదివారం నిర్వహించిన బైక్ ర్యాలీని సక్సెస్‌చేయడానికి పెయిడ్‌బ్యాచ్‌ను కంట్రోల్‌చేయలేక స్థానిక బీఆర్ఎస్ నేతలు ఎంతో శ్రమ పడాల్సి వచ్చింది. బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన వారికి రూ. 500 చొప్పున ముట్ట చెప్పారు. దీనికి గాను జంట కార్పొరేషన్ల కార్పొరేటర్ల కు యాభై మంది చొప్పున టార్గెట్ పెట్టారు. బైక్ ర్యాలీలో పాల్గొన్న వారికి కార్పొరేటర్లు ముందుగానే టోకెన్ ఇచ్చి ర్యాలీ అనంతరం వారికి నగదు అందజేశారు. ఆదివారం కూడా కావడంతో చాలా మంది ఖర్చులకు వస్తాయని బైక్ ర్యాలీకి వచ్చామని మీడియాకు చెప్పడం గమనార్హం.

ముగ్గురు క్యాండిడేట్ల బీఫాంలకు బ్రేక్..!

ఆయా అభ్యర్థులను మార్చే యోచనలో కాంగ్రెస్!

- థర్డ్ లిస్ట్ ఆలస్యానికి కారణం ఇదేనా..
- 60 మందికి బీ ఫామ్‌ల అందజేత

విశాల భారతి, హైదరాబాద్:

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగియటానికి మరికొద్ది రోజుల సమయం మాత్రమే మిగిలింది. పార్టీలు ఇప్పటికే ప్రకటించిన తమ తమ అభ్యర్థులకు బీఫాంలను అందజేస్తున్నాయి. దీంట్లో అన్నింటికంటే ముందుగా బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థులకు బీఫాంలోని అందజేయగా సెకండ్ ప్లేస్‌లో కాంగ్రెస్ పార్టీ నిలిచింది. నవంబర్ 10వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుండటంతో ఆదివారం నుంచే బీఫాంలు అందించడం మొదలుపెట్టింది కాంగ్రెస్. మొత్తం 100 మంది అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ 19 స్థానాలకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అందులో భాగంగా మొదటి రోజు కాంగ్రెస్ 60 మంది అభ్యర్థులకు బీఫాంలను అందజేసింది. ఇంకా 40 మంది బీఫాంలు తీసుకోవల్సి ఉంది. అందులో మూడు బీఫాంలను కాంగ్రెస్ అధిష్టానం హోల్డ్‌లో పెట్టినట్టుగా సమాచారం. దీంతో 37 మంది అభ్యర్థులకు మాత్రమే బీ ఫాంలు ప్రస్తుతానికి రెడీగా ఉన్నాయి. అభ్యర్థుల ప్రకటనతో ఇప్పటికే అందరూ కదనరంగంలో దూసుకుపోతున్నారు. పలువురు అభ్యర్థులు ప్రచారంలో ఉండటంతో వారి తరపున వారి కుటుంబ సభ్యులు బీఫాంలను అందుకుంటున్నారు. పీసీసీ చీఫ్‌రేవంత్ రెడ్డికి కూడా బీఫాం చేరింది. చాంద్రాయణగుట్ట అభ్యర్థి బోయ నగేశ్‌కు గాంధీ భవన్ లో మొదటగా బీఫాం అందుకున్నారు. సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి రావి శ్రీనివాస్, నిర్మల్ నియోజక వర్గం నుంచి శ్రీహరి రావు తరపున ఆయన కూతురు బీఫామ్ తీసుకున్నారు. జగిత్యాల నియోజక వర్గం నుంచి జీవన్ రెడ్డి కుమారుడు బీఫామ్ అందుకున్నారు. ఇక రామగుండం అభ్యర్థి మకన్ సింగ్ ఠాకూర్ బీఫాంను వారి కుమారులు గాంధీ భవన్ లో అందుకున్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజక వర్గం నుంచి బరిలోకి దిగుతున్న ప్రజా యుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెల బీఫాం అందుకున్నారు. ఇక పరిగి అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి తరపు నుంచి అతని కుమారుడు గాంధీభవన్‌లో బీఫాం తీసుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డికి బీఫామ్ అందజేశారు. గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, విశ్వనాథ్, ఉపాధ్యక్షులు నిరంజన్ తదితరులు అభ్యర్థులకు బీఫాంలు అందజేశారు.ఇదిలావుంటే మూడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన బీఫాంలను మాత్రం ఏఐసీసీ హోల్డ్‌లో పెట్టినట్టు సమాచారం. ముగ్గురిలో చేవెళ్ల అభ్యర్థి భీమ్ భరత్, బోథ్ అభ్యర్థి వెన్నెల అశోక్, వనపర్తి నుంచి సీనియర్ నేత చిన్నారెడ్డికి సంధించిన బీఫాంలను హోల్డ్‌లో పెట్టడంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయా నియోజకవర్గాలకు అభ్యర్థులుగా ప్రకటించిన వారిని మార్చే యోచనలో హైకమాండ్ ఉన్నట్టు తెలుస్తోంది. వనపర్తి టికెట్‌ను రాహుల్ గాంధీ హోల్డ్‌లో పెట్టగా, బోథ్‌టికెట్‌ను సోనియా గాంధీ హోల్డ్‌లో పెట్టినట్టు సమాచారం. బోథ్ వెన్నెల అశోక్ స్థానాన్ని నరేశ్‌జాదవ్‌కు, వనపర్తి టికెట్‌ను శివసేనారెడ్డికి యూత్ కాంగ్రెస్ కోటాలో భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. చేవేళ్ల టికెట్‌ప్రకటించిన భీమ్ భరత్ బీఫాం కూడా ప్రస్తుతానికి హోల్డ్‌లో ఉంచారు. చేవెళ్ల టికెట్ ఎవరికి ఇస్తారు? అనేదానిపై ఇంకా పూర్తి క్లారిటీ రాలేదు. ఇదిలా వుంటే, కమ్యూనిస్టులతో పొత్తు అంశంలో కూడా పూర్తి క్లారిటీ రాకపోవడంతో, కాంగ్రెస్ అభ్యర్థుల థర్డ్‌లిస్ట్‌మరింత ఆలస్యం అయ్యేలా కనిపిస్తోంది. నవంబర్ 10 శుక్రవారంతో నామినేషన్ల గడువు ముగియనుండగా, బుధవారం వరకు కాంగ్రెస్ ఫైనల్ లిస్టు వచ్చే అవకాశం కనిపించట్లేదు.

ప్రచారంలో హై స్పీడ్!

- ఎత్తుకు పై ఎత్తులతో దూసుకెళ్తున్న పార్టీలు
- రేపు తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ
- వరుస సభలకు ప్లాన్‌చేసిన 'హస్తం' పార్టీ
- బీఆర్ఎస్ సెకండ్ ఫేజ్ క్యాంపెయిన్ షురూ

విశాల భారతి, హైదరాబాద్:

అసెంబ్లీ ఎన్నికల తేదీ గడువు సమీపిస్తుండడంతో మూడు ప్రధాన పార్టీలు ప్రచారం ఉధృతంగా చేస్తున్నాయి. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ షురూ కావడంతో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మంగళవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే బీసీ గర్జన సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం ఐదున్నర గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఎల్బీ స్టేడియం వెళ్లి బహిరంగ సభకు హాజరవుతారు. బీసీ గర్జన సభను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లక్ష మందిని సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సభా ఏర్పాట్లను ఆ పార్టీ ప్రతినిధుల బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. బీసీ నినాదాన్ని ఎత్తుకున్న బీజేపీ.. తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది.

కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్..

మరోవైపు వరుస సభలకు టీ కాంగ్రెస్ ప్లాన్ చేసింది. ఈనెల 9న ముస్లిం మైనారిటీ డిక్లరేషన్ ప్రకటన చేసేందుకు హస్తం పార్టీ సన్నద్ధమౌతోంది. హైదరాబాద్ లేదా నిజామాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి పార్టీ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్‌తో మైనారిటీ డిక్లరేషన్ విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. ఈ నెల 10న కామారెడ్డి సభ ఏర్పాటు చేసి బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని కూడా టీ కాంగ్రెస్ సన్నద్ధమౌతోంది. కామారెడ్డి సభకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య హాజరవుతారని తెలుస్తోంది.

స్పీడు పెంచిన బీఆర్ఎస్..

బీఆర్ఎస్ ప్రెసిడెంట్, సీఎం కేసీఆర్ ఈ నెల 9 వరకు రెండోవిడత ప్రచారంలో భాగంగా మరో 10 నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. అలాగే ఈ నెల 13 నుంచి 28 వరకూ మూడోవిడత ప్రచారంలో భాగంగా 16 రోజుల పాటు 54 ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు బీఆర్ఎస్ ఏర్పాట్లు చేస్తోంది. 28న గజ్వేల్ నియోజకవర్గంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభతో కేసీఆర్ ఎన్నికల ప్రచారం ముగుస్తుంది. దీంతో మొత్తం 96 సభల్లో కేసీఆర్ పాల్గొన్నట్లు అవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. వివిధ నియోజకవర్గాల్లో హరీశ్ రావు, కేటీఆర్, ఇతర సీనియర్ మంత్రుల పర్యటనలున్నాయి.